క్లుప్తంగా

15 లోపు దరఖాస్తు చేసుకోండి

కనిగిరి రూరల్: మ్యాన్యువల్ పారిశుద్ధ్య కార్మికులకు పునరావాసం కల్పించేందుకు పనిచేస్తున్న సంస్థల నుంచి సామాజిక కార్యకర్తలను డివిజన్ స్థాయి కమిటీలోకి ఎంపిక చేయనున్నట్లు కనిగిరి సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఇ. రాజేశ్వరమ్మ తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన నూతన కమిటీ ఏర్పాటు చేస్తామని, సామాజిక కార్యకర్తలుగా పనిచేయాలనుకున్న వారు ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తూముకు మరమ్మతులు


పాలేటి తూము పరిశీలిస్తున్న ఏఈ రామకృష్ణ

పీసీపల్లి: స్థానిక పాలేటిపల్లి రిజర్వాయర్ తూములను ఇరిగేషన్ ఏఈ రామకృష్ణ మంగళవారం పరిశీలించారు. తూము నుంచి నీరు లీకు కాకుండా మరమ్మతులు చేయించారు. రైతులు, చేపలు పట్టేవారు రిజర్వాయర్ వద్ద నీటిని జాగ్రత్తగా వాడుకోవాలన్నారు. నీరు లీకయ్యేలా ఎటువంటి దుశ్చర్యలకు పాల్పడవద్దన్నారు.

పోషకాహార కేంద్రాలుగా అంగన్‌వాడీలు


ర్యాలీలో అంగన్ వాడీ అధికారులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు

కనిగిరి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేసే పోషకారం, మెనూపై విస్తృతంగా ప్రచారం చేయాలని సీడీపీఓ సరోజని అన్నారు. మండలంలోని పునుగోడు అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో మంగళవారం జరిగిన జన బాగి దారి జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. మాచవరం సెక్టార్ పరిధిలోని తుమ్మగుంట ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో జరిగిన జన బాగి దారి కార్యక్రమంలో సూపర్‌వైజర్ మల్లేశ్వరి పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ రత్తమ్మ ఓబులేసు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు కొండమ్మ, ఎస్తేరమ్మ, విజయ కుమారి, సుజాత,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాసంగా జన భగీరథ


ఫ్లకార్డులతో అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు

వలేటివారిపాలెం: మండలంలోని జెడ్ ఉప్పలపాడు అంగన్‌వాడీ సెంటర్లో మంగళవారం జన భగీరథ కార్యక్రమం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యాకార్యాక్రమాల అవశ్యకతపై అవగాహన పెంచడానికి కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. జయలక్ష్మి, హెల్పర్ కృష్ణవేణి, ప్రధానోపాధ్యాయులు జి.జెమిమా పాల్గొన్నారు.

సచివాలయానికి వాటర్ కూలర్ అందజేత


వాటర్ కూలర్ అందజేస్తున్న మల్లికార్జున, తిరుపతిస్వామి

పొన్నలూరు: మండలంలోని చెరుకూరు గ్రామ సచివాలయానికి గ్రామానికి చెందిన దాతలు కాటా మల్లికార్జున, సల్లగోసు తిరుపతిస్వామి రూ.10 వేల విలువైన వాటర్ కూలర్‌ను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రవణమ్మ మాట్లాడుతూ.. సచివాలయానికి పనుల మీద వచ్చే ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా వాటర్ కూలర్ బహూకరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు తువ్వపాడులో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

కొనకనమిట్ల: మండలంలోని తువ్వపాడు గ్రామంలో పునర్నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పోలేరమ్మ, గణపతి, సుబ్రహ్మణ్య, నాగేంద్ర స్వామి, శీతలాదేవి విగ్రహాలతో పాటు యంత్ర, జీవ, ధ్వజ, నవగ్రహ విగ్రహాలను వేద పండితుడు ఓరుగంటి సీతారామ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. కంకణదారులతో హోమాలు నిర్వహించారు. తొలుత దేవతా విగ్రహాల గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం పుణ్యాహవచన హోమం, సీతారాముల మందిరం వద్ద ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, యంత్ర పూజ, సుందరకాండ పారాయణం, నివేదన హారతి, శాంతి కల్యాణం, అన్నదానం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.


నిర్మానుష్యంగా ఉన్న మండల కేంద్రంలో రోడ్లు


ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల రోడ్డు

● భానుడు భగభగ

హనుమంతునిపాడు: నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే మండల కేంద్రంలోని రోడ్లు ఎండల దెబ్బకు నిర్మానుష్యంగా మారుతున్నాయి. కార్యాలయాల పరిసరాల్లో ఎవరూ కనిపించడం లేదు. మంగళవారం ఎండకు, వీస్తున్న వడ గాడ్పులకు ఎవరూ రోడ్ల మీదికి రాలేదు. టీ కొట్లు, బంకులు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఎప్పుడూ జనాలతో ఉండే రోడ్లు ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్నాయి. ఒక్క పిల్ల కూడా రోడ్లపై కనిపించ లేదు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

హనుమంతునిపాడు: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సచివాలయాల పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పంచాయతీ విస్తరణ అధికారి షేక్ షరీఫ్, ఏపీఓ వెంకటేశ్వర్లు, ఏపీఎం నాగేశ్వరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ ఈశ్వరమ్మ

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ


చాకిచర్లలో విద్యా సామగ్రి అందిస్తున్న దాత రమేష్


పొన్నలూరులో విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మాధవరావు

ఉలవపాడు: మండల పరిధిలోని చాకిచర్లలో అంబేడ్కర్ స్టడీ సెంటర్‌లోని విద్యార్థులకు మంగళవారం విద్యా సామగ్రి అందించారు. గ్రామానికి చెందిన దాసరి రమేష్ (జగన్) 60 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, జామెంట్రీ బాక్స్‌లను అందచేశారు. శ్రీశ్రీ నగర్ లో పదో తరగతి పాస్ అయిన వారికి వాచీలు అందించారు. స్థానిక అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. దాత దాసరి రమేష్, అంబేడ్కర్ యువజన సంఘ నాయకులు, భాస్కరరావు, హరి కృష్ణ, మల్లికార్జున, రాంబాబు. సతీష్ కుమార్ పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్లు పంపిణీ

పొన్నలూరు: మండలంలోని చెన్నిపాడు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు చేతుల మీదుగా జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేసి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. నాడు నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలను మార్చి అన్ని రకాల వసతులు కల్పించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెన్నపూస శ్రీనివాసులురెడ్డి, గుత్తి భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జేవీకే కిట్ల పంపిణీ

కనిగిరి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రిన్సిపాల్ వీవీ రమణయ్య, ఎస్ఎంసీ చైర్మన్ జి. బాల చెన్నారావు అన్నారు. మంగళవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు అనితా, వెంకట్రావ్, రమేష్, రవి పాల్గొన్నారు.

వీర్ల బ్రహ్మయ్యకు నివాళి

కనిగిరి రూరల్: ఏపీ ముదిరాజ్ మహాసభ మాజీ అధ్యక్షులు వీర్ల బ్రహ్మయ్య భౌతిక కాయానికి మండలంలోని కంర్లవారిపల్లిలో ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ మంగళవారం సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వీర్ల బ్రహ్మయ్య మృతి పార్టీకి తీరని లోటన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, మాజీ ఎంపీపీ పాతు కొండారెడ్డి పాల్గొన్నారు.

పలువురి నివాళి

వీర్ల బ్రహ్మయ్య భౌతిక కాయాన్ని మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డితో పాటు, నాయకులు సందర్శించి నివాళులర్పించారు. అశ్రునయనాల మధ్య బ్రహ్మయ్య అంత్యక్రియలు జరిగాయి. వివిధ సంఘాల నాయకులు వీర్ల విజయ రామరాజు, కె. పెద్దన్న, పి. మోహన్, సయ్యద్ యాసీన్, ముదిరాజ్ మహా సభ రాష్ట్ర, జిల్లా నాయకులు ఇండ్లా కోటేశ్వరరావు, పందిళ్ల శ్రీనివాసులు, గోగు శివుడు, కోడి నారాయణ, మాసేపల్లి రామయ్య, నరేంద్ర, ఈర్ల రామరాజు, ఆకుమళ్ల కోటేశ్వరావు, దేవూరి వెంకటేశ్వర్లు, జి. రవికుమార్, దానయ్య పాల్గొన్నారు.


బ్రహ్మయ్య భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ


ఆలయానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

పామూరు: మండలంలోని రేగిచట్లపల్లెలో నూతనంగా నిర్మించతలపెట్టిన గ్రామ దేవత పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి మంగళవారం వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి భూమిపూజ చేశారు. అర్చకులు మహంకాళి శివప్రసాద్ గర్తరిపూజ, పుణ్యాహవచనం, కళశస్థాపన నిర్వహించగా హుసేన్‌రెడ్డి, పలువురు నాయకులు నూతన నిర్మాణ పనులను భూమిపూజతో ప్రారంభించారు. మాజీ సర్పంచ్ తమ్వా మాలకొండారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, గట్లా విజయ భాస్కర్‌రెడ్డి, మూల కోటిరెడ్డి, ఇల్లూరి రామిరెడ్డి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 50 మంది విద్యార్థులకు సభ్యత్వం

ఉలవపాడు: మండల కేంద్రమైన ఉలవపాడు గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులకు హాజరైన 50 మంది విద్యార్థులు ధరావత్తు సభ్యులు గా చేరినట్లు గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరరావు తెలిపారు. మే 8 వ తేదీ నుంచి జూన్ 11 వరకు జరిగిన ఈ శిక్షణా తరగతుల ద్వారా ఆకర్షితులై వారి తల్లిదండ్రుల ఆలోచనతో సభ్యులుగా చేరినట్లు తెలిపారు.

ధరల స్థిరీకరణ నిధి సమావేశం రేపు

కందుకూరు: వ్యవసాయ ధర స్థిరీకరణ నిధి సమావేశం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో గురువారం సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరౌతారని, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరుకావాలన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

పొన్నలూరు: గ్రామాల్లో మూడేళ్లు నిండిన చిన్నారులను స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి సూచించారు. స్థానిక ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం 'జనబాగీదార్' కార్యక్రమం నిర్వహించి ప్రీస్కూల్‌పై అవగాహన కల్పించారు. కాన్వెంట్ స్కూల్స్‌కు దీటుగా అంగన్‌వాడీ సెంటర్లలో ప్రాథమిక విద్య బోధిస్తున్నట్లు చెప్పారు. రోజూ పౌష్టికాహారం అందజేస్తారన్నారు.


పొన్నలూరులో ప్రీస్కూల్‌పై అవగాహన కల్పిస్తున్న రమాదేవి

ఇంటర్‌లో విద్యార్థుల సత్తా


పామూరు: ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సమీర్


కనిగిరి: విద్యార్థికి స్వీట్లు తినిపిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పామూరు: ఇంటర్ ప్రథమ సంవత్సర బెటర్‌మెంట్, సప్లిమెంటరీ, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ ఫలితాల్లో పామూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జూనియర్ ఇంటర్ బెటర్‌మెంట్ ఫలితాల్లో ఇంగ్లీష్ మీడియం ఎంపీసీలో ఎస్‌వీ జూనియర్ కళాశాలకు చెందిన షేక్.తౌహిద్ 465/470 మార్కులతో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం, షేక్ మన్సూరా 463/470 మార్కులతో నాలుగో స్థానం, సీఈసీలు ఇ.హేమ భాగ్యలక్ష్మి 476/500 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానం సాధించినట్లు సీపీ యేలూరి సుబ్బారావు, ప్రిన్సిపాల్ షేక్.సమీద్ బాషా మంగళవారం తెలిపారు.

కృష్ణ చైతన్య విద్యార్థుల ప్రతిభ

కనిగిరి రూరల్: ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో కృష్ణ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఎంపీసీలో బి. వెంకటబాబు 470 మార్కులకు 464 మార్కులు సాధించి స్టేట్ రెండో ర్యాంక్, బైపీసీలో ఎ. లలిత 440 మార్కులకు గాను 429 మార్కులతో టౌన్ టాప్, సీఈసీలో ఎం. శేధర్‌రెడ్డి 500 మార్కులతో 477 మార్కులు సాధించి టౌన్ టాప్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ రామకృష్ణా తెలిపారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు సుబ్బారెడ్డి, మల్లికార్జున, శ్రీనివాసులరెడ్డి, మత్తయ్య, కోదండం, ఆదాం, శ్రీనివాసులు అభినందించారు.

ఎమ్మెస్సార్ విద్యార్థుల సత్తా

కనిగిరి రూరల్: ఇంటర్ ఫలితాల్లో ఎంఎస్ఆర్ విద్యార్థినులు ప్రతిభ చాటారు. ఎంపీసీ ఇంగ్లీష్ మీడియంలో ఎస్‌కే సమీరా, 470కి 463 మార్కులు, పెద్దేటీ సాయి చందన 470కి 462 మార్కులు సాధించగా, బైపీసీ ఇంగ్లీష్ మీడియంలో దోగూర్తి నాగూర్‌బీ 440కి 427 మార్కులు, వీరం రెడ్డి భానురెడ్డి 440కి 424 మార్కులు సాధించారు. అంతేగాక 32 మంది విద్యార్థులు 400 మార్కులకు పైగా సాధించారు. ప్రిన్సిపాల్ టి. వెంకటరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

డబ్బు కోసం కూలీలను డిమాండ్ చేస్తే చర్యలు


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి అన్నపూర్ణ

కొండపి: ఉపాధి హామీ పథకం కూలీలను డబ్బు కోసం బెదిరిస్తే కఠిన చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి కె.అన్నపూర్ణ హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు, సిబ్బందితో సమీక్ష అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో కూలీలు డబ్బు ఇవ్వాలని కొంత మంది మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ కార్యాలయ సిబ్బంది డిమాండ్ చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఎవరూ నయాపైసా ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కూలీలకు పని కల్పించకపోయినా, కూలి సొమ్ము పంపిణీలో ఉద్దేశపూర్వకంగా జాప్యం చేసినా తన దృష్టికి తీసుకరావాలని సూచించారు. ఉపాధి హామీ పని ప్రదేశాలను రోజూ తనిఖీ చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్‌కు మండల స్థాయి అధికారులు కచ్చితంగా హాజరుకావాలన్నారు. ప్రతి అధికారి మండల కేంద్రంలో నివసిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామ సచివాలయాల్లో సైతం సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, మిగతా రోజుల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రీవెన్స్ నిర్వహించాలన్నారు. అర్జీలను వేగంగా పరిష్కరించకుండా అలసత్వం వహిస్తే ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని చెప్పారు. ఎంపీడీఓ ఎంపీ రమణమూర్తి ఉన్నారు.

స్కూల్ బస్‌లపై ప్రత్యేక నిఘా



సీజ్ చేసిన బస్ వద్ద ఎంవీఐ రవికుమార్

దర్శి: స్కూల్ బస్‌లపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఎంవీఐ రవికుమార్ అన్నారు. దర్శిలో ఫిట్‌నెస్ లేని కారణంగా రెండు బస్‌లపై మంగళవారం ఆయన కేసు నమోదు చేశారు. ఎంవీఐ రవికుమార్ మాట్లాడుతూ పిల్లలను దృష్టిలో పెట్టుకుని పాఠశాలలు ప్రారంభమైన సందర్భంగా స్కూల్ బస్‌లు ఫిట్‌నెస్, కండీషన్, పొల్యూషన్, ఇన్సూరెన్స్, ఐదేళ్ల అనుభవం కలిగిన డ్రైవర్, క్లీనర్ తప్పని సరిగా ఉండాలని చెప్పారు. అలా లేని బస్‌లు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఫిట్‌నెస్ లేని బస్‌లు నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఫిట్‌నెస్ లేకుండా నడిపి ప్రమాదాలు జరిగితే స్కూల్ యాజమాన్యాలపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులను పరిమితికి మించి బస్ ఎక్కించినా కేసులు నమోదు చేస్తామన్నారు.

7 షాపులకు వేలం

కందుకూరు: పట్టణంలోని పాతకూరగాయల మార్కెట్ స్థలంలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని 8 షాపులకు మంగళవారం వేలం నిర్వహించగా 7 షాపులను లబ్ధిదారులు దక్కించుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ మనోహర్ తెలిపారు. జనరల్ కేటగిరీ కింద ఉన్న షాపు నెంబర్ 2ని రూ. 15వేలకి, షాపునంబర్-3, రూ. 14వేలు, షాపు నంబర్-4,5 రూ. 13,500 వంతున, షాపు నంబర్-6 రూ. 12,000, షాపు నంబర్ -7 రూ. 11,000కు దక్కించుకున్నారు. 8వ నంబర్ షాపును పాడుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ముత్యాలగుంట పార్కు వద్ద నూతనంగా నిర్మించిన రూమ్‌ను రూ. 6వేలకు దక్కించుకున్నట్లు తెలిపారు.

టంగుటూరులో నిలిచిన పొగాకు వేలం


వేలంలో పాల్గొన్న వ్యాపారులు

టంగుటూరు: స్థానిక వేలం కేంద్రంలో మంగళవారం పొగాకు కొనుగోళ్ల ప్రక్రియ నిలిచిపోయింది. పొందూరు క్లస్టర్ రైతులు 880 బేళ్లను వేలానికి ఉంచగా వ్యాపారులు 200 బేళ్లు కొనుగోలు చేశారు. ఈ క్రమంలో ఎఫ్-9 గ్రేడ్ రకానికి మద్దతు ధర కేజీకి రూ.200 కల్పించాలని రైతులు డిమాండ్ చేయడంతో వేలం నిలిచిపోయింది. అప్పటి వరకు సాగిన వేలంలో 5 బేళ్లను వ్యాపారులు వివిధ కారణాలతో తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.240, కనిష్ఠ ధర రూ.160, సరాసరి ధర రూ.209.28 పలికింది. వేలంలో మొత్తం 29 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

తూనికలు..కొలతల శాఖ అధికారుల తనిఖీలు

= 11 షాపులపై కేసుల నమోదు


తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ మోహిసిన్

కురిచేడు: తూనికలు.. కొలతల శాఖ పొదిలి ఇన్‌స్పెక్టర్ షేక్ మోహిసిన్ తన సిబ్బందితో మంగళవారం పలు షాపులను తనిఖీ చేశారు. దొనకొండ, కురిచేడు మండలాల్లోని 11 షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. కాటాలకు ముద్రలు లేవని, సరుకుల ప్యాకెట్లపై డిక్లరేషన్ వివరాలు లేవని గుర్తించి సంబంధిత వ్యాపారులపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధించినట్లు ఆయన తెలిపారు. ఇకపై నెలకోసారి షాపులను తనిఖీ చేయనున్నట్లు చెప్పారు. షాపులు మూసి ఉంచడం సరైన పద్ధతి కాదని, కచ్చితంగా ప్రతిషాపు తనిఖీ చేయాల్సి ఉందన్నారు. ప్యాకెట్లు కొనేటప్పుడు డిక్లరేషన్ ఉండేలా వ్యాపారులు చూసుకోవాలని, కాటాలకు ఏటా ముద్రలు వేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది భాస్కర్, రమేష్, నారాయణ పాల్గొన్నారు.

రెండు వాహనాలు సీజ్

కొమరోలు: అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్న రెండు వాహనాలను ఇరిగేషన్ అధికారులు సీజ్ చేశారు. మండలంలోని అక్కపల్లె చెరువులో మంగళవారం జేసీబీ సాయంతో ట్రాక్టర్లకు అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టారు. సమాచారం అందుకున్న ఇరిగేషన్ ఏఈ జయరామయ్య.. పోలీసుల సహకారంతో అక్కపల్లె చెరువులో ఉన్న ట్రాక్టర్, జేసీబీని పోలీసుస్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా చెరువులు, కుంటల్లో మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈ జయరామయ్య హెచ్చరించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యమే దివ్యాంగుల ఆయుధం

పొదిలి రూరల్: జీవితంలో ఎదుగుదలకు వైకల్యం అడ్డుకాదని, ఆత్మస్థైర్యమే ఆయుధంగా దివ్యాంగులు ముందుకు సాగాలని జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు జి.అర్చన పేర్కొన్నారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలు, రాయితీలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంగళవారం పొదిలి స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో దివ్యాంగులకు మంజూరైన నూతన త్రిచక్ర వాహనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసి అనేక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.శ్రీకృష్ణ, దివ్యాంగుల సంఘం చైర్మన్ ముంతాజ్ పఠాన్, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సంఘ జిల్లా అధ్యక్షుడు దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి, రీజినల్ కోఆర్డినేటర్ మాలపోలు శ్యామ్, బత్తిన నరసింహారావు, పొదిలి, కొనకనమిట్ల దివ్యాంగుల సంఘ అధ్యక్షులు దేవళ్లపల్లి ఆంజనేయులు, నుసుం బాలచంద్రుడు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షురాలు ఎస్‌కే నూర్జహాన్‌బేగం, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, పుల్లిగొర్ల శ్రీనివాసరావు, ముల్లా జాకీర్, ముల్లా షరీఫా, ముల్లా హసన్‌వలి పాల్గొన్నారు.

చెంచు కుటుంబాలకు భోజనాలు

అర్ధవీడు (కంభం): అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులుగా మిగిలిన చెంచు కుటుంబాలను మాజీ ఎంపీపీ నన్నెబోయిన రవికుమార్ యాదవ్ మంగళవారం పరామర్శించారు. ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. మంటల్లో ఇళ్లు కాలిపోయి కట్టుబట్టలతో నిరాశ్రయులుగా మిగిలిన కాలనీ వాసులకు భోజన ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు రావిపాటి రామేశ్వరరెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
కందుకూరు డివిజన్
90102 24456
Office mail : sakshiongads@gmail.com